క్లుప్తంగా

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మున్సిపల్ చైర్ పర్సన్ హేమలత



తుక్కుగూడ: పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ హేమలత

తుక్కుగూడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బరిగెల హేమలత పేర్కొన్నారు. మంగళవారం పుర కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సీఎం కప్ క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ జూపాల భావన, హెచ్‌ఎం రాములు, పీడీ భాస్కర్‌రెడ్డి, నాయకులు చెన్నకేశవరెడ్డి, ముత్యాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ఇలవేల్పు సూర్యగిరి ఎల్లమ్మ



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు ఇలవేల్పుగా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సామూహిక సత్యానారాయణ స్వామి వ్రతాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో 2025 ఆర్థిక సంవత్సరానికి కొబ్బరికాయాలు, పూజా సామగ్రి, లడ్డు, పులిహోర అమ్ముకునే హక్కు, ఒడి బియ్యం, అమ్మవారి చీరలు, కొబ్బరి చిప్పలు సేకరించే హక్కు కోసం బుధవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ వి. మోహన్‌రావు ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు కొబ్బరి కాయ, లడ్డు పులిహోర, కొబ్బరి చిప్పల సేకరణ వేలంలో పాల్గొనదలచిన వారు రూ.20వేలు, ఒడి బియ్యం, అమ్మవారి చీరల సేకరణకు రూ.10వేలు అదే రోజు ఒక గంట ముందు వచ్చి డిపాజిట్ నగదు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని రాయపోల్ నుంచి పొల్కంపల్లికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారిందని, వెంటనే రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంగళవారం కే. బార్గవ్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుంతలుగా రోడ్డు మారడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ విషయంలో స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మాడ్గుల: సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని మాజీ మార్కెట్ డైరెక్టర్ సురమళ్ల సుభాష్ ఆరోపించారు. మంగళవారం మాడ్గుల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభు త్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. రైతు భరోసా నేటికీ విడుదల చేయలేదని, భరోసాకు మంగళం పాడే ప్రయాత్నాలను ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. ఈ కార్య క్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కల్వకుర్తి: టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ సభ్యులు, సీనియర్ న్యాయవాది అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో టీడీపీ డిజిటల్ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదిలాల్ మాట్లాడారు. టీడీపీతోనే బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ రాజ్, యాదయ్య, శివ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..!

- జల్లులకే రోడ్డు బురదమయం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు, విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



చిత్తడిగామారిన కందుకూరు చౌరస్తా నుంచి ప్రభుత్వ కళాశాల, పాఠశాలకు వెళ్లే రహదారి

కందుకూరు: చినుకు పడితే ఆ రహదారి చిత్తడిగా మారడంతో విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని కొత్తగూడ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలకు రాకపోకలు సాగించాలని నిర్మించిన రహదారి. అప్పట్లో ప్రజాప్రతినిధులు రూ.10 లక్షల నిధులతో మొరం పోసి చదును చేయించారు. కానీ సీసీ రోడ్డు వేయించలేదు. ప్రస్తుతం చిన్నపాటి జల్లు పడితే రోడ్డు బురదమయంగా మారుతుంది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దాదాపుగా కిలోమీటర్ వరకు అదే పరిస్థితి ఉంది. ఈ విషయంలో అధికారులు స్పందించి సీసీ రోడ్డు వేయించాలని పలువురు కోరుతున్నారు.

వర్షం పడితే....



కస్తూర్బాగాంధీ పాఠశాలలో మా ఇద్దరు పిల్లలు రెండేళ్ల నుంచి చదువుతున్నారు. వారిని తీసుకెళ్లడానికి లేదా అక్కడి నుంచి రాకపోకలు చేయాలంటే రోడ్డు సరిగ్గా లేక అవస్థలు పడుతున్నాం. వర్షం పడితే ఇబ్బందులు తప్పవు.

– రజిత, సాయిరెడ్డిగూడ

సీసీ రోడ్డు వేయాలి



మా పాపను కస్తూర్బాగాంధీ పాఠశాలలో చదివిస్తున్నా. కందుకూరు వరకు వచ్చి అక్కడి నుంచి పాఠశాలకు వెళ్లాలంటే వర్షాకాలంలో నడవడానికి ఇబ్బంది పడాల్సి వస్తుంది. సీసీ రోడ్డు నిర్మిస్తే బాగుంటుంది.

– నిర్మల, సింగరేణికాలనీ, హైదరాబాద్

ప్రతిపాదనలు పంపుతాం..

గతంలో మొరానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు కాగా పనులు పూర్తి చేయించాం. మళ్లీ ఆ రహదారిపై సీసీ నిర్మించాలని ఎవరి నుంచి ప్రతిపాదనలు రాలేదు. రోడ్డు పరిస్థితిని పరిశీలించి నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతాము. త్వరలో సమస్య పరిష్కరిస్తాం.

– సతీష్‌రెడ్డి, ఏఈఈ, కందుకూరు

అయ్యప్ప భక్తులకు భిక్ష



అన్నదాత అనితారెడ్డిని సన్మానిస్తున్న అయ్యప్ప భక్తులు

మహేశ్వరం: మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అయ్యప్ప భక్తులకు మంగళవారం భిక్ష(అన్నదాన) కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఆమె సూచించారు. అంతకుముందు ఆలయంలో అయ్యప్ప భక్తులకు భిక్ష నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనితారెడ్డిని అయ్యప్ప భక్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అయ్యప్ప గురు స్వాములు శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ అల్లె కుమార్, శ్రీశైలం , రమేశ్, శ్రీకాంత్ పలువురు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని వినతి



షామీమ్ అక్తర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహేశ్వరం: రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఎస్సీ రిజర్వేషన్ ఏకసభ్య కమిషన్ హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ షామీమ్ అక్తర్‌ను మంగళవారం బైండ్ల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ చేయడంతో ఎస్సీలలో ఉన్న ఉపకులాలు విద్య, ఉద్యోగ రంగాల్లో లబ్ధిపొందుతాయన్నారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. కమిషన్‌ను కలిసిన వారిలో రాష్ట్ర బైండ్ల సంఘం అధ్యక్షుడు తంగడపల్లి శివశంకర్, ప్రధాన కార్యదర్శి మరపాక మనోహర్, గౌరవ అధ్యక్షుడు ఏర్పుల యాదయ్య, జిల్లా బైండ్ల కుల సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి ఏపూరి రాజు, కోశాధికారి బైండ్ల నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి

ఎంఈఓ పాండు



ఆమనగల్లులో పరీక్ష వ్రాస్తున్న విద్యార్థులు

ఆమనగల్లు: విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగినప్పుడే రాణిస్తారని ఎంఈఓ పాండు పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వాసవీ కల్యాణ మండపంలో గురువారం జ్ఞానవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాల చూచివ్రాత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాండు ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠ్యపుస్తకాలు చూస్తూ పరీక్షలు రాయడంతో విద్యార్థుల్లో పఠనా సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానవాహిని ఫౌండేషన్ అధ్యక్షుడు రవీంద్రనంద్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి సత్యం, ఫౌండర్ రంగారావ్, సభ్యులు రామనాథం, బికుమాండ్ల నర్సింహా, డాక్టర్ శ్రీనివాస్, యాదగిరి, జగదీశ్, నర్సింహా, శ్రీనివాస్, సతీష్, సురేశ్, సాయిబాబా, ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బస్టాప్‌లో వెలుస్తున్న దుకాణాలు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు



బస్టాప్‌లో కొబ్బరి బొండాల దుకాణం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని సాగర్ రహదారిపై బస్ స్టాప్‌లో ప్రయాణికులు నిల్చునే అవకాశం లేకుండా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు వేచి ఉండాల్సిన చోట ఆటోలు, దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. గుర్రంగూడ చౌరస్తా నుంచి మొదలుకుని మన్నెగూడ వరకు బస్ స్టాప్‌లలో ఇదే పరిస్థితి దాపురించింది. ఈ విషయంలో ఆర్టీసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



స్టడీ మెటీరియల్ అందిస్తున్న చంద్రశేఖర్

ఆమనగల్లు: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్, కంటి వైద్యులు చంద్రశేఖర్ కోరారు. ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం తన మనవడు నిహాల్ సాయి పుట్టినరోజు సందర్భంగా క్లాస్‌మెట్‌క్లబ్ సహకారంతో పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు క్లాస్ మెట్ క్లబ్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పాండు, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, మహేశ్, కృష్ణయ్య, స్థానికులు అనూష, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో నూతనంగా నిర్మిస్తున్న ఎంపీడీఓ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఎంపీడీఓ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన నందిగామ మండల కేంద్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కనీసం మండల కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేకపోయిందని విమర్శించారు. కేవలం శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీలైనంత త్వరగా ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలను పూర్తిచేస్తోందన్నారు. వచ్చే జనవరి 26లోపు ఎంపీడీఓ భవన నిర్మాణాన్ని పూర్తి చేసినట్లయితే జెండాను ఎగురవేస్తామని వివరించారు. భవనాలతో పాటు గ్రంథాలయం, ప్రెస్‌క్లబ్‌ను సైతం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్‌ఏఈ హేమంత్, ఏఎంసీ డైరెక్టర్ నర్సింహ, నాయకులు, కాంట్రాక్టర్ భిక్షపతి పాల్గొన్నారు.



ఎంపీడీఓ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం



మీర్‌పేటలో నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి, నాయకులు



బడంగ్‌పేటలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- తెలంగాణ తల్లి విగ్రహ మార్పుపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన

మీర్‌పేట: కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీర్‌పేట చందనచెరువు వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. నాడు మేథావులు, కళాకారులను సంప్రదించి ఉద్యమస్ఫూర్తితో రాష్ట్ర అస్తిత్వానికి ప్రతీకగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దఎత్తున ప్రతిష్ఠించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు విగ్రహాన్ని మార్చాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. ఇప్పటికే అధికార చిహ్నంలో చార్మినార్, కాకతీయ కళాతోరణం, విగ్రహం చేతిలో ఉన్న బతుకమ్మను చెరిపే ప్రయత్నం చేశారని వాటన్నింటినీ ప్రజలందరూ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగినబుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీపై అడగడానికి వెళ్లిన ఆశావర్కర్లపై లాఠీఛార్జీ చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల పేరు చెప్పుకొని పబ్బం గడుపుకుంటున్నారని, పదేళ్లలో కేసీఆర్ మహిళలను మహారాణులుగా చూసుకున్నారని, ఏ పథకం తీసుకొచ్చినా మహిళ కేంద్ర బిందువుగా తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గా దీప్‌లాల్‌చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, సిద్దాల లావణ్య, ధనలక్ష్మీరాజ్‌కుమార్, రజాక్, నాయకులు అర్కల కామేష్‌రెడ్డి, దిండు భూపేశ్‌గౌడ్, తెరేటిపల్లి శ్రీనివాస్‌గుప్తా, హమునాయక్, శిశుపాల్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

బడంగ్‌పేటలో..

బడంగ్‌పేట్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం బడంగ్‌పేటలోని సాయిబాలాజీ చౌరస్తాలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు.అనంతరం జై తెలంగాణ అని నినాదించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడ ర్ సూర్లగంటి అర్జున్, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి,ఏనుగు రాంరెడ్డి,పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వం

కందుకూరు: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు అనేగౌని దామోదర్‌గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పి.ఆనంద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జి.సామయ్య, మాజీ సర్పంచ్ కె.రామ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాన్ని మార్చడం సరికాదు

పహాడీషరీఫ్: తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం అంటే ఇక్కడి ప్రజలను అవమానించడమేనని బీఆర్‌ఎస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ కార్య నిర్వాహక అధ్యక్షుడు షర్ఫొద్దీన్ హామెద్, యంజాల జనార్ధన్‌లు అన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ పిలుపుమేరకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆదేశాలతో జల్‌పల్లి కమాన్ వద్ద మంగళవారం తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో కళాకారులు, మేథావుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేసిన విగ్రహాన్ని ఇప్పుడు మార్చడం సరైందికాదన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక టీఎస్‌ను టీజీగా మార్చడం తప్పా మరేమీ చేయలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యంజాల అర్జున్, సయ్యద్ బదర్, సయ్యద్ ఆరీఫ్ అలీ, బర్కత్ అలీ, అజీమ్ ఖాన్, అలీ మన్సూరీ, మహ్మద్ సలీం, అబ్దుల్ కరీం, నగేశ్, సయ్యద్ పటేల్ పాల్గొన్నారు.



కందుకూరు చౌరస్తాలో..



పహాడీషరీఫ్: జల్‌పల్లి కమాన్ వద్ద తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పేదింటి ఆడబిడ్డ వివాహానికి చేయూత

కల్వకుర్తి: మండల కేంద్రంలోని 6వ వార్డుకు చెందిన దివంగత కేశనిశివ, బాలమ్మ దంపతుల కూతురు మాధవి వివాహానికి, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ చేయూతనందించారు. నిరుపేద కుటుంబం కావడంతో మాధవి వివాహం చేయడానికి కుటుంబం సభ్యులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికుల ద్వారా ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ తెలుసుకుని మంగళవారం ఆమెకు రూ.21 వేలతో పాటు, పట్టుచీర అందజేశారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ, మాజీ ఎంపీటీసీ గోపాల్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, లక్ష్మణ్‌చారి, నర్సింహ, అశోక్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పూజలో పడి ముట్టిస్తున్న స్వాములు

చేవెళ్ల: స్వామి శరణం.. అయ్యప్ప శరణం స్వామియే అయ్యప్ప.. అయ్యప్పో స్వామియే అంటూ భక్తుల నినాదాలు, స్వామివారి భక్తిగీతాలతో మల్కాపూర్ గ్రామం భక్తిభావంతో నిండిపోయింది. మండలంలోని మల్కాపూర్‌లో మంగళవారం గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటేశ్ 18వ పడిపూజను నగరానికి చెందిన అరుణ్ గురుస్వామి చేతుల మీదుగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న అయ్యప్ప మాలధరించిన స్వాములతో పాటు ఇతర మండలాలకు చెందిన స్వాములు సైతం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పూజలో భక్తి గీతాలు ఆలపించేందుకు ప్రత్యేక భజన బృందాలను ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామంలో భక్తిపారవశ్యం సంతరించుకుంది. స్వాములకు, ప్రజలకు సీహెచ్ పాండు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పూజల్లో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు కార్తీక్‌రెడ్డి, మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ప్రభాకర్, వెంకటేశ్, గణేశ్, వంగ శ్రీధర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ విజయలక్ష్మీరమణారెడ్డి, బీజేపీ యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, గురుస్వాములు కృష్ణానస్ పంతులు, ఉమా శంకర్ గురుస్వామి, సత్యనారాయణ, సుబుద్ధి, గ్రామ నాయకులు, ప్రజలు తదితరులు ఉన్నారు.